క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

పూసపాటిరేగ: భోగాపురం మండలం బైరెడ్డి పాలెం గ్రామానికి చెందిన శీరపు దుర్గారెడ్డికి కిడ్నీ మార్పిడి చికిత్స కోసం సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన 4 లక్షల రుపాయల చెక్కును ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మోపాడలోని తన స్వగృహంలో శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆపదలో ఉన్న కుటుంబాలను ఆదుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో బైరెడ్డిపాలెం గ్రామానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా శంకర్‌రెడ్డి

విజయనగరం టౌన్: నగరంలోని కంటోన్మెంట్ గూడ్స్‌షెడ్ వద్దనున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ట్రస్ట్‌బోర్డు కమిటీ చైర్మన్‌గా రెయ్యి శంకర్‌రెడ్డి రెండోసారి పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఆలయ ఈఓ పద్మావతి, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ లక్ష్మి సమక్షంలో శంకర్‌రెడ్డితో పాటు కమిటీ సభ్యులు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ కమిటీ సభ్యులుగా ఎంపికై న ప్రసాద్, భీమరాజు, శోభారాణి, మారమ్మ, రమణమ్మ, లక్ష్మి, సోమశేఖర్‌లను ఈ సందర్భంగా పలువురు అభినందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన 40వ వార్డు కార్పొరేటర్ బోనెల ధనలక్ష్మి మాట్లాడుతూ.. కమిటీ సభ్యులు ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడిగా ఆశపు వేణు


ఆశపు వేణు

విజయనగరం: పార్టీ సంస్థాగత నియామకాల్లో భాగంగా వైఎస్సార్‌సీపీ నగర పార్టీ అధ్యక్షుడిగా ఆశపు వేణును నియమిస్తూ అధిష్టానం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన విజయనగరం కార్పొరేషన్ కో ఆప్షన్ సభ్యుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఉపాధ్యక్షులుగా గొలగాన సాయిలక్ష్మి, బంగారు దేముడులకు అవకాశం కల్పించారు. అదేవిధంగా ప్రధాన కార్యదర్శులుగా బొద్దాన అప్పారావు, రెడ్డి పద్మావతి, జమ్మాన శ్రీనివాసరావులను.. కార్యదర్శులుగా కశెట్టి సుధాకర్, మొయిద ఆదినారాయణ, దువ్వ శ్రీను, తోట రాజశేఖర్, వర్రి పద్మావతి.. కోశాధికారిగా కాపుగంటి రమేష్‌లను నియమించారు. వీరితో పాటు మరో 15 మందిని ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా అవకాశం కల్పించారు.

చట్టాల్లో మార్పులు చేయడం తగదు

విజయనగరం పూల్‌బాగ్: దేశంలోని కార్మికులు, రైతులను కార్పొరేట్ పెట్టుబడిదారులకు బానిసలుగా మార్చేలా చట్టాల్లో మార్పులు చేయడం ప్రధాని మోదీకి తగదని కార్మిక, రైతు సంఘాల ఐక్య కార్యాచరణ సమితి నేతలు అన్నారు. దేశంలోని 13 కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాల ఐక్య కార్యాచరణ సమితి అధ్వర్యంలో ఇచ్చిన గ్రామీణ భారత్‌బంద్ పిలుపు మేరకు శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ఆవరణలో ఉన్న జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాల నుంచి కలెక్టరేట్ అవుట్ గేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మద్రాపు సూర్యనారాయణ, బుగత అశోక్, మొదిలి శ్రీనివాసరావు, కాకి సురేష్, గీత, బెహరా శంకరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి క్రైస్తవుల సమస్యలు

విజయనగరం టౌన్: జిల్లాలో క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఆశాజాన్ కోరారు. ఈ మేరకు జిల్లా మైనారిటీ సంక్షేమాధికారిగా బాధ్యతలు తీసుకున్న సంఘమిత్ర ఆర్‌ఎస్.జాన్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్ జాన్‌ను సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాలాడ ఆనందరావు, ఎమ్‌ఏ నాయుడు, వై.ప్రభాకర్, పాస్టర్ అక్కులా రాములు, మార్క్ పాల్గొన్నారు.

బోర్లు ప్రారంభం

విజయనగరం: నగరంలోని వైఎస్సార్ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన నాలుగు బోర్లను డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ, ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రత్యేక దృష్టితో ప్రజల తాగునీటి సమస్యలు పరిష్కరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్‌వీవీ రాజేష్, తోనంగి జగన్నాథ్‌రెడి పాల్గొన్నారు.

వచ్చే నెలలో జాతీయ వర్క్‌షాపు

విజయనగరం అర్బన్: మహారాజా అటానమస్ కళాశాలలో 'క్వాంటమ్ మెకానిక్స్' అంశంపై బోధన సిబ్బందికి వచ్చే నెల 11 నుంచి 13వ తేదీలలో జాతీయ వర్క్‌షాప్ నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సాంబశివరావు తెలిపారు. ఈ మేరకు వర్క్‌షాపునకు సంబంధించిన బ్రోచర్లను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్స్ సౌజన్యంతో సదస్సు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్న అధ్యాపక, పరిశోధకులు, విద్యార్థులు మార్చి 4వ తేదీలోగా 'ఎల్‌డబ్ల్యూఎం 2024.ఎంఆర్‌సీఏ' జీ మెయిల్ ద్వారా వివరాలు తెలియజేయాలని సూచించారు.

వలంటీర్ల సేవలకు వందనం..

- ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ


కార్యక్రమంలో పాల్గొన్న వలంటీర్లు


సేవారత్న అందుకున్న వలంటీర్లతో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్,ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

డెంకాడ: ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిటకు వెళ్లి అందిస్తున్న వలంటీర్లకు వందనం.. అభివందనమని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో వలంటీర్లకు వందనం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు సేవారత్న, సేవామిత్ర, సేవావజ్ర అవార్డులు పొందిన వలంటీర్లకు ప్రశంసాపత్రాలు అందించి, శాలువాలతో సత్కరించారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఇళ్ల వద్దకే పాలన తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి వలంటీర్ల వ్యవస్థ తీసుకువచ్చారన్నారు. ఆయన ఆశయ సాధనకు అనుగుణంగా వలంటీర్లు పనిచేస్తున్నారని, భవిష్యత్‌లో కూడా ఇలాగే పనిచేసి ప్రభుత్వానికి అండగా నిలబడాలని కోరారు. వలంటీర్లు పారదర్శకంగా సేవలందిస్తుంటే ప్రతిపక్షాలు ఓర్వలేక ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో 175 ఎమ్మెల్యే స్థానాల్లో వైఎస్సార్‌సీపీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ నాయకుడు నారా లోకేష్ రెడ్ డైరీ పేరుతో బెదిరిస్తున్నారన్నారు. అధికారం కోసం లోకేష్ పగటి కలలు కంటున్నారని తెలిపారు. జనసేన నాయకురాలు లోకం మాధవి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, పరిశ్రమ ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు అందిస్తామని చెప్పి అప్పటి ప్రభుత్వం నుంచి భూములు పొంది, ఇప్పుడు తమపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ కర్రోతు బంగార్రాజు అధికారం కోసం పగటి కలలు కంటున్నారని, ఆయన స్వగ్రామం పోలిపల్లిలో మెజార్టీ తెచ్చుకోగలరా అని సవాల్ విసిరారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీలు పిన్నింటి తమ్మనాయుడు, కూరాలకు అనిత, ఎంపీడీఓ లవరాజు, తహసీల్దార్ రామారావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, జేసీఎస్ కన్వీనర్ సారిక గౌరి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఓర్వలేక విమర్శలు..



ప్రజలకు సేవలందిస్తున్న మాపై కొంతమంది కావాలనే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. ప్రభుత్వ పథకాలను నిష్పక్షపాతంగా లబ్ధిదారులకు అందజేస్తున్నాం. ప్రభుత్వ పథకాలతో పాటు జగనన్న ఆరోగ్యశ్రీ వంటి వైద్యశిబిరాల నిర్వహణలో కూడా సేవలందిస్తున్నాం. మేమంతా ప్రజా సేవకులం.. జగనన్న నమ్మకస్తులం.

– మహేష్, వలంటీర్, బంటుపల్లి గ్రామం

ప్రజలను ఆదుకున్నారు..



కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో సైతం ప్రజలను సీఎం జగనన్న ఆదుకున్నారు. కరోనా సమయంలో కుటుంబ సభ్యులు సైతం సపర్యలు చేయలేని పరిస్థితుల్లో వలంటీర్లు సేవలందించారు. నేను వలంటీర్‌గా చేరిన కొత్తలో సాంకేతిక కారణాలతో గౌరవేతనం రాకపోవడంతో కొందరు చులకనగా మాట్లాడారు. అయినా నేను సేవ చేయాలన్న లక్ష్యంతో పని చేశాను. ఇప్పుడు నాకు కేటాయించిన కుటుంభాల గౌరవాన్ని పొందుతున్నాను.

– విజయలక్ష్మి, ఒమ్మిపేట గ్రామం, పినతాడివాడ పంచాయతీ.

ప్రజలందరిపై ఆదిత్యుని ఆశీస్సులు

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి


డిప్యూటీ స్పీకర్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు, కమిటీ సభ్యులు

విజయనగరం: ఆరోగ్య ప్రదాత ఆదిత్యుని ఆశీస్సులు ప్రతి ఒక్కరి పైనా ఉండాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆకాంక్షించారు. రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని బాబామెట్టలో ఉన్న ఏడు కోవెళ్లలోని సూర్యభగవానుడిని శుక్రవారం సతీసమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ మర్యాదల ప్రకారం అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు ఆలవెల్లి నరసింహశర్మ, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి పి. శివకుమార్, కమిటీ చైర్మన్ కేపీపీ రాజు, కార్యవర్గ సభ్యులు రాజు, నారాయణరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భోగాపురం: మండలంలోని ముక్కాం, సవరవిల్లి, ముంజేరు, గూడెపువలస, రావివలస, అమటాం, దల్లిపేట, బైరెడ్డిపాలెం, రెడ్డికంచేరు, రావాడ, తూడెం, కవులవాడ, నందిగాం, రామచంద్రపేట పరిధిలో విద్యుత్ మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ మస్తాన్‌వలీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రోడ్డు భద్రతపై అవగాహన

విజయనగరం గంటస్తంభం: విద్యార్థులందరూ రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె.రవిశంకర్ ప్రసాద్ అన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు–2024లో భాగంగా నగరంలోని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో రోడ్డు భద్రతపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనం నడిపేటప్పుడు సీట్ బెల్ట్, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. అలాగే ఉప రవాణా కమిషనర్ కార్యాలయంలో వాహన డ్రైవర్లు, డ్రైవింగ్ టెస్ట్‌కు వచ్చిన వారికి రోడ్డు భద్రత అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమంలో ప్రాంతీయ రవాణా శాఖాధికారి ఎస్.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

నెల్లిమర్ల: మిమ్స్ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ళ శ్రీరాములనాయుడు అన్నారు. 15 రోజులుగా స్థానిక ఆర్‌ఓబీ వద్ద మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు చేస్తున్న నిరసన శిబిరాన్ని ఆయన శుక్రవారం సందర్శించి, మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మిమ్స్ యాజమాన్యం ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఇరువర్గాలు చర్చలు జరుపుకుని సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన ఉద్యోగులకు రూ. పది వేల పోరాట నిధి అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సారిపల్లి గుర్నాథరావు, మిమ్స్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు టీవీ రమణ, ఉద్యోగులు ఎం.నారాయణరావు, కె. కామునాయుడు, ఎం. నాగభూషణం, మూర్తి, రాంబాబు, మధు, గౌరి, వరలక్ష్మి, రామకృష్ణ, బంగారునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో విప్లవాత్మక మార్పులు

- వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి


రోగులకు మెడికల్ కిట్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి

భోగాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తన పాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని ముంజేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని శుక్రవారం పరిశీలించి, రోగులకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ.. జగనన్న ప్రవేశపెట్టిన ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదలందరికీ మెరుగైన వైద్యం అందుతోందని చెప్పారు. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులపై ఈ శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా మారుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి. చంద్రకళ, సర్పంచ్ పూడిక నూకరాజు, పిగుడు రాంబాబు, పట్నా తాతయ్యలు, నడుపూరి నరసింహనాయుడు, వైద్యులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

తాగునీరు అందించేందుకు ప్రత్యేక చర్యలు

- వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి


భోగాపురం బస్టాప్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన బోరును ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి

భోగాపురం: రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని మండలంలోని ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఇందులో భాగంగా సుమారు రూ.12.50 లక్షల ఎంపీపీ నిధులతో భోగాపురం పంచాయతీ పెదహరిజనపేటలో 3, చాకలిపేట గుడి వద్ద 1, భోగాపురం బస్‌స్టాండ్ వద్ద 1, పశువుల ఆస్పత్రి వద్ద 1, కొయ్యపేటలో 1, సరేవలసలో 1, సువందరపేటలో 2, కవులవాడ జంక్షన్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన బోర్లను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప్పాడ మాట్లాడుతూ.. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని ముందస్తు చర్యల్లో భాగంగా మండల వ్యాప్తంగా 30 బోర్లు ఏర్పాటు చేశామని చెప్పారు. అంతేకాకుండా మండల వ్యాప్తంగా ఉన్న 630 బోర్ల మరమ్మతులకు రూ. 5 లక్షల ఎంపీపీ నిధులతో మెటీరియల్ కొనుగోలు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పడాల శ్రీనివాసరావు, సుందర హరీష్, దాట్ల శ్రీనురాజు, అప్పురభుక్త పైడినాయుడు, కొండపు కొత్తయ్యరెడ్డి, కొయ్య బంగార్రాజు, ఉడికల గురువులు, బొద్ద భాస్కరరావు, పోతిరెండి గోపి, బావిశెట్టి మాధవరావు, ఆళ్ల మాధవరావు, కోరాడ అప్పన్న, ఎంపీటీసీ సభ్యులు కొయ్య సంతోషి, పట్నా తాతయ్యలు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- 32, 49 డివిజన్‌లలో కుళాయిల ప్రారంభం


గాజులరేగ ఎస్సీ కాలనీలో నూతన కుళాయి కనెక్షన్లు ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: వేసవిలో తాగునీటికి ఇబ్బందులు రాకుండా ముందస్తు జాగ్రత్తగా అన్ని చర్యలు తీసుకుంటున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 32, 49 డివిజన్‌ల పరిధిలో గల నాయుడు కాలనీ, గాజులరేగ ఎస్సీ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన కుళాయిలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ.. నగరంలోని వివిధ చోట్ల రూ. 23 లక్షలతో కుళాయిలు ఏర్పాటు చేశామని, దీని ద్వారా 700 మంది కుటుంబాల తాగునీటి అవసరాలు తీరుతాయని చెప్పారు. 15 వేల కిలో లీటర్ల కెపాసిటీ గల వాటర్ ట్యాంక్ నిర్మించిన తర్వాత మూడు డివిజన్ల పరిధిలో తాగునీటి సమస్య తీరిపోయిందన్నారు. 50వ డివిజన్‌లో 36 లక్షల రూపాయలు వెచ్చించి పైప్‌లైన్‌లు వేసినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించి ప్రజా సమస్యలు తెలుసుకున్నామని, ప్రస్తుతం ఆ సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. మరోసారి తనకు శాసనసభ్యుడిగా అవకాశం ఇస్తే సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, ఆయా డివిజన్‌ల కార్పొరేటర్లు ఎన్ని లక్ష్మణరావు, నడిపిల్లి ఆదినారాయణ, జోనల్ ఇన్‌చార్జ్‌లు బొద్దాన అప్పారావు, మారం బాల బ్రహ్మరెడ్డి, రెడ్డి గురుమూర్తి, కనుగులు రాజా, తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్, కుళాయి కనెక్షన్లు ప్రారంభం

విజయనగరం: నగర ప్రజల దాహార్తిని తీర్చిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అపర భగీరథుడని వైఎస్సార్‌సీపీ విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ముద్దాడ మధు, పార్టీ నాయకుడు ముచ్చు శ్రీనివాసరావు అన్నారు. నగరంలోని ఒకటో డివిజన్ వేణుగోపాలపురం ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్‌ను.. 17 డివిజన్‌లో 25 లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన కుళాయి కనెక్షన్లను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు ముద్దాడ మధు, ముచ్చు శ్రీనివాసరావు మాట్లాడుతూ.. నగరంలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తుంటే, కోలగట్ల వీరభద్రస్వామి స్థానికంగా అభివృద్ధే ధ్యేయంగా సాగుతున్నారన్నారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ముచ్చు లయాయాదవ్, ఈఈ దక్షిణామూర్తి, డీఈ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

రామనారాయణంలో రథసప్తమి వేడుకలు


విజయనగరం రూరల్: సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో రథసప్తమి సందర్భంగా సూర్య భగవానుడికి శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోపూజ చేపట్టారు. కార్యక్రమంలో ఎన్‌సీఎస్ ట్రస్టీలు నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి దంపతులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

సీతం ఇంజినీరింగ్ కళాశాల గర్ల్స్ హాస్టల్‌లో.. విజయనగరం అర్బన్: గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో రథసప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి. కళాశాల కరస్పాండెంట్, మాజీ ఎంపీ డాక్టర్ బొత్సఝాన్సీలక్ష్మి రథ సప్తమి విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ రామమూర్తి, చీఫ్ వార్డెన్ కెప్టెన్ సత్యవేణి, విద్యార్థులు పాల్గొన్నారు.


విజయనగరం అర్బన్: సీతం ఇంజనీరింగ్ కళాశాలలో రథసప్తమి పూజలు

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

విజయనగరం టౌన్: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని ప్రముఖ సాహితీవేత్త, అవధాని డాక్టర్ కట్టమూరి చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం స్థానిక లేడీస్ రిక్రియేషన్ క్లబ్‌లో పైడిమాంబ కళానికేతన్ ఆధ్యాత్మిక సేవా సంఘం ఆధ్వర్యంలో పైడితల్లికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏప్రిల్ నెలలో నిర్వహించబోయే సంస్థ వార్షికోత్సవానికి సంబంధించి చేపట్టాల్సిన అంశాలపై సభ్యులతో చర్చించామన్నారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్.సూర్యపాత్రో, పెద్దింటి అప్పారావు, ధవళ సర్వేశ్వరరావు, బీశెట్టి బాబ్జీ, పీవీఏవీఎస్ భానురాజా, పాకలపాటి రమణమ్మ, సామవేదుల గీతారాణి, ఏడిద వీర్రాజు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు

- ట్రాఫిక్ సీఐ రంగనాథ్

విజయనగరం క్రైమ్: మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ రంగనాథ్ అన్నారు. పట్టణంలోని పలు ప్రధాన కూడళ్ల వద్ద శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలు నడుపుతున్న 17 మంది మైనర్లను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సైలు లోవరాజు, శంబాన రవి, ఏఎం.రాజు, త్రినాథ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రాధాన్యం


జొన్నాడ-అక్కివరం తారురోడ్డు పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

డెంకాడ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చిందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని జొన్నాడ నుంచి అక్కివరం తారురోడ్డు మరమ్మతులకు ఎమ్మెల్యే శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రూ. 4 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, సర్పంచ్‌లు కోరాడ రమణి, సువ్వాడ రమేష్, తోరోతు త్రిమూర్తులు, కంది కిరణ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యురాలు త్రిపురగిరి దేవి, జొన్నాడ పీఏసీఎస్ అధ్యక్షుడు పిన్నింటి సత్యారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కోరాడ కోటినాయుడు, రమణరాజు, లోకేష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

విజయనగరం: నగరంలోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ జంక్షన్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహాన్ని ఈ నెల 20న మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆవిష్కరించనున్నారని వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఒక్కరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఆర్థిక సాయం


నరేష్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరి సహస్ర

విజయనగరం: గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న సాలూరు మండలం మెట్టవలస గ్రామానికి చెందిన నిమ్మక నరేష్ కుటుంబ సభ్యులకు చిన్న శ్రీను సోల్జర్స్ అసోసియేషన్ ఆర్థికసాయం అందజేసింది. నిమ్మక నరేష్ కుటుంబ సభ్యులు నగరంలోని ప్రదీప్‌నగర్‌లో గల చిన్న శ్రీను సోల్జర్స్ కార్యాలయంలో అధ్యక్షురాలు సిరి సహస్రను శుక్రవారం కలిసి కష్టాన్ని వివరించారు. దీంతో ఆమె స్పందించి తక్షణ సాయం కింద రూ. 5 వేలు అందజేసింది. మెరుగైన వైద్యం అందించేందుకు సహకారం అందిస్తామని బాధితలకు భరోసా కల్పించారు.

ఆర్థిక స్వావలంబనతో మహిళా సాధికారత

విజయనగరం: ఆర్థిక స్వావలంబనతోనే మహిళా సాధికారిత సాధ్యపడుతుందని, ఆ దిశగా ముందడుగు వేసే ప్రతి మహిళకు సహాయ, సహకారాలు అందిస్తామని చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరిసహస్ర తెలిపారు. స్థానిక వైష్ణవవీధిలో గల వికాస్ మానసిక దివ్యంగుల పాఠశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బ్లాక్ ప్రింటింగ్ యూనిట్‌ను శుక్రవారం ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ, మహిళలంతా ఒక చోట కలిసి స్వయంకృషితో ముందడగు వేయడం శుభపరిణామమని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

శంఖారావానికి స్పందన కరువు

- జనాలు లేక గంట ఆలస్యంగా ప్రారంభం
- టికెట్ ఎవరిదో తేల్చకపోవడంతో కార్యకర్తల్లో అయోమయం


సభలో నినాదాలు చేస్తున్న లోకేష్, తదితరులు

పూసపాటిరేగ/నెల్లిమర్ల రూరల్: నెల్లిమర్ల మండలం రామతీర్థం ప్రకృతి లేఅవుట్‌లో శుక్రవారం జరిగిన టీడీపీ శంఖారావం సభ అంతంత మాత్రంగానే సాగింది. షెడ్యూల్ ప్రకారం ఉదయం 10 గంటల కు సభ ప్రారంభం కావాల్సి ఉండగా.. జనం లేకపోవడంతో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ బస్సుల్లోనే గంట పాటు వేచి ఉండాల్సి వచ్చింది. ఎట్టకేలకు 11 గంటలకు ప్రారంభమైన సభలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున తన ప్రసంగంలో మంత్రి బొత్స సత్యనారాయణపై సత్యదూరమైన ఆరోపణలు చేయడంతో సొంత పార్టీ కార్యకర్తల నుంచి స్పందన రాలేదు. టీడీపీ హయాంలో నెల్లిమర్ల నియోజకవర్గంలో వెయ్యి కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు లోకేష్ చెప్పడంతో ప్రజలు ఆశ్చర్యపోయారు.అలాగే పలుమార్లు రెడ్‌బుక్ చూపించి ఇందులో ఉన్న అధికారులపై చర్యలు తీసుకుంటామని పదే పదే చెప్పడం విసుగు తెప్పించింది. ఏడు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి మంత్రిగా పనిచేసిన టీడీపీ సీనియర్ నాయకుడు పతివాడ నారాయణస్వామినాయుడుకు సభలో ప్రసంగించడానికి అవకాశం కల్పించలేదు. టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ కర్రోతు బంగార్రాజు మాట్లాడుతూ.. సర్వే చేసి తమకు బలం ఉంటేనే టికెట్ ఇవ్వాలని లోకేష్‌ను కోరగా... జనసేన నెల్లిమర్ల నియోజక ఇన్‌చార్జ్ లోకం మాధవి మాట్లాడుతూ.. నెల్లిమర్లలో అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నాను, ప్రతి గ్రామానికి సొంత నిధులతో ట్యాంకర్ల ద్వారా తాగునీరు పంపిణీ చేస్తున్నానని చెప్పారు. దీంతో అటు టీడీపీ, ఇటు జనసేన నాయకులు తమ బల నిరూపణకు ఈ సభను వినియోగించుకున్నారని పలువురు గుసగుసలాడుకున్నారు. లోకేష్ వెంట వచ్చిన వలంటీర్లు టీడీపీ కార్యకర్తలతో గొడవ పడడంతో సభా ప్రాంగణం రసాభాసగా మారింది. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మహంతి చిన్నంనాయుడు, సువ్వాడ రవిశేఖర్, కడగల ఆనంద్‌కుమార్, కంది చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.